


# ఊరు తరిమేసింది

ఆంధ్ర జ్యోతి - 6-5-1977

---

మన శిరస్సు మీద మనమే.... భస్మాసురహస్తాన్నుంచుకుంటు న్నాం..... ఇక మన బ్రతుకుల్ని మార్చడం..... ఎవరి తరం?

- జయప్రద

---

మెటర్నిటీ హాస్పిటల్ 'కారిడార్' గుండా 'స్ట్రెచర్' గరగర శబ్దం చేసుకుంటూ లేబర్ రూమ్ వైపెళుతోంది. దాని వెనగ్గా చిన్నా పెద్దా ఓ డజను మంది ఆతృతతో, శోకాలతో, ప్రార్థనలతో, పరుగులాంటి నడకతో వస్తున్నారు. ఇంతమంది దూరి వచ్చేస్తున్నందుకు వాచ్‌మెన్ కోప్పడుతూ వాళ్ళను వెంబడిస్తున్నాడు. అయినవాళ్ళు ప్రాధేయపడుతున్నారు. కాని వాళ్ళు రూల్స్ మాట్లాడుతున్నారు. స్ట్రెచర్ మీద మనిషి కళ్ళు తేలేస్తోంది. స్ట్రెచర్ ప్రక్కన ఆమె తేల కళ్ళలో కళ్ళుపెట్టి శవంలా నడుస్తున్న టీచర్ రంగనాధం ఎదురువస్తున్న డాక్టర్ లలితకు నమస్కారం చేసాడు. ఆ నమస్కారంలో తన కోరికలన్నీ ఏకమై భార్య ప్రాణదానం కొరకు యాచన మాత్రమే మిగిలింది. డాక్టర్ లలిత నమస్కారాన్ని అందుకోలేదు. పేషంట్ దగ్గరగా గబగబా నడచి పల్స్ మీద వేలుపెట్టి కనుబొమ్మలు ముడిచింది.

"కమాన్ క్విక్ తొందరగా పట్టండి. స్టాఫ్! సెలైన్ సెట్‌రెడీ చేయండి. బ్లడ్ ఫర్ గ్రూపింగ్ యండ్ క్రాస్ మ్యాచింగ్ తీసి సెలైన్ స్టార్ట్ చేసేయండి. బ్లెడ్ బ్యాంకుకు శ్యాంపిల్స్ పంపాలి. ఊ. బి క్విక్."

ఆమె చేసే హడావిడికి అర్థం అతనికి భార్యను తన వూరులో రక్తపు మడుగులో చూడగానే అర్థమయింది.

లేబర్ రూమ్‌లోకెళ్ళి ఓ అరగంట తరువాత తిరిగొచ్చిన డాక్టర్ లలిత కూర్చొని 'కేస్‌షీట్' వ్రాయటానికి ఉపక్రమిస్తూ అడిగింది.

"అసలేం జరిగింది?" రామనాథం చెప్పే స్థితిలో లేడు. దూరపు బంధువు ఎవరో ముందుకు వచ్చింది.

"ఆ రోజు ఉదయం ఉన్నట్టుండి కుళాయి త్రిప్పినట్టు రక్తం పోయిందమ్మా మొన్ననే తొమ్మిదవ నెల వచ్చింది."

"ప్రొద్దుననగా రక్తంపోతే ఇప్పటివరకూ ఏమి చేస్తున్నారమ్మా!" విసుక్కుంది లలిత. ఆ విసుగు వెనుక ఆ పేషెంట్ దౌర్భాగ్యానికి చింత. అలా అజాగ్రత్త చేసి బంధుజనం మూర్ఖత్వానికి జాలి వున్నాయి.

మరోవ్యక్తి మొదలెట్టాడు. "లేదమ్మగారూ! అటు రకతం పోవటం చూసిన నేను ప్రెసిడెంటుగారింటికి లగెత్తాను. ఆ బాబు కొక్కడికే కారుండేది. వాళ్ళ అమ్మాయి యీ రోజు శెలవలకింటి కొత్తొందంట. ఆమెగారికి కారు పంపాలంట. ఈలు కాదన్నాడు. గబగబా ఎడ్లబండి కట్టించి రోడ్డు జంక్షన్ కాడికొచ్చాము. ప్రతి బస్సులోనూ కాలెట్టుకొని బ్రతిమలాడాను. చిన్న మెత్తు జాగాలేదు, వాళ్ళు మట్టుకేమి సేత్తారు. దాంట్లోనే తీసుకొచ్చాము. బస్సు మాత్రం దొరకలేదు. ఎట్టో ఇందాక ప్రాణాలతో అట్టుకొచ్చాము. మా అయ్యోరికి మీరే దేవుళ్ళు. రచ్చించాల డాటరమ్మా!" బహుశ ఆయన పక్కింటాయన అయ్యుంటాడు. సహాయాన్ని చేయాలనే కోరికతో పాటు తన సహాయాన్ని గుర్తించాలనే తహతహ కూడా సమపాళ్ళలో వున్నట్టుంది.

"సకాలంలో ఆమెకు వైద్య సహాయం దొరికుంటే పరిస్థితి యింత విషమించేది కాదు." రామానాధంగారిని చూస్తూ అంది డాక్టర్ లలిత. అతను మాట్లాడలేదు. జోడించిన చేతులు విడదీయలేదు. అయినా అతని కళ్ళలో అర్థింపు ఆమెకు బోధపడినట్లుంది.

"అధైర్య పడకండి. మేము చేయాల్సిందంతా చేస్తాము. ఆపైన భగవంతుడున్నాడు."

"మీ చేతుల్లో పెట్టాము" నోరు పెగల్చుకున్నాడు రామనాధం.

"మీ వూళ్ళో పి.హెచ్.సి. వుంది కదా. అక్కడ చూపకపోయారా?"

"హాస్పిటల్ వుందండి. లేడి డాక్టర్ 'లాంగ్ లీవు'లో వున్నారు. ఇంకో డాక్టరుగారు యీ రోజు రేపు లీవుపెట్టి వాళ్ళ వూరెళ్ళారు."

నిర్లిప్తంగా చెపుతున్న అతని నుండి చూపులు విడదీసుకుంటూ ప్రక్కన వున్న డాక్టరుతో అంటోంది డాక్టర్ లలిత.

"మనం డాక్టర్లమన్న బాధ్యత, కర్తవ్యం ఎవ్వరిలో లేకుండా పోతోంది. ఎంత సేపటికి 'టౌన్'లో వర్కు చేయాలనే కానీ పల్లెటూర్లలో కావలసిన వైద్య సహాయాన్ని గురించి మర్చిపోతున్నారు. పల్లెటూరులో పోస్టు చేయంగానే లీవులు పెట్టేయడం. అంతే. పేరుకు హాస్పిటల్ ఉంటుంది. డాక్టర్లు కనిపించరు." ప్రక్కన వున్న డాక్టరు సన్నగా నవ్వింది.

"నిన్ను పల్లెలకేస్తే వెళ్తావా!"

"తప్పకుండా. ఎక్కడికేస్తే అక్కడి కెళతాను. ఇలాంటి వాళ్ళను హత్య చేస్తున్నది మన డాక్టర్లే." ఆవేశంగా చెపుతున్న డాక్టర్ లలిత మాటలకు రామనాథం ఉలిక్కిపడ్డాడు.

అందుకెవరు బాధ్యులు? పల్లెల్లో డాక్టర్లు వర్క్ చేయటానికి యిష్టపడక పోవటానికి కారణమెవరు?

పశ్చాత్తాపంతో రామనాథం కళ్ళు నిండిపోయినాయి.

ఆ పశ్చాత్తాపం తాలూకూ గతంలోకి మెల్లిగా జారుకున్నాడు.

* * * * *

"నాకే ఎదురు జవాబు చెపుతుందా. నేకోరిన స్త్రీ నా కోరిక తీర్చకుండా తప్పించుకోవడమా? డాక్టరని ఎంత గర్వం."

డాక్టరమ్మ అని ఆమె తన శీలాన్ని కాపాడుకోలేదు. కేవలం ఒక స్త్రీగా తన శీలాన్ని రక్షించుకోవాలనుకుంది. అది ఆ వూరి ప్రెసిడెంట్ దృష్టిలో దోషమైపోయింది.

మరోరోజు కూతురి అస్వస్థత మీద పెట్టి తన కోర్కె తీర్చుకోవాలనుకున్న ప్రెసిడెంట్ ఆమెకు కబురు పెట్టినా తన యింటికి రాలేదని కోపం రాలేదు. కాని అదే రోజు మునసబు భార్యను చూడ్డానికి వెళ్ళినందుకు వెఱ్ఱి ఆవేశం వచ్చింది. ఆమె మీద కథలల్లారు. ఆయన చేతిలో వున్న బలగానికి బుద్ధిలేదు. ఆయన తల ఎటు తిప్పమంటే అటు తిప్పుతారు. కాస్తో కూస్తో మేధ కలిగిన తను మటుకు ఏం చేశాడు! తన జీతం నెల నెల సక్రమంగా అందాలంటే ప్రెసిడెంటు మాట వినాలి. మాట వినకపోతే వెనక ఆస్తులు లేని తమ ఆరుగురి పొట్టలు మాడాలనే సత్యం తెలిసి తను కూడా ఆయన అనమన్నది అనమన్నట్టే అన్నాడు.

ఓ శుభ ముహూర్తాన ఆ ఊరి బళ్ళో చదువుతున్న బీద విద్యార్థి తల్లికి ప్రాణం మీదికి ముంచుకొచ్చింది. రెండు రోజులు ఇంటిలో కడుపులో బిడ్డను బయటవేసే ప్రయత్నంలో గడిపి, గర్భసంచి ఒక తట్టుకునే శక్తి లేక చిరిగి వూరుకుంటే నాడి అందని స్థితిలో ఆ వూరి ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. ఆ సంగతి తెలిసిన ప్రెసిడెంటుగారు ఆ సదవకాశాన్ని వదులుకోదల్చుకోలేదు. రామనాథాన్ని పిలిపించి,

"నీ స్టూడెంటు తల్లి చావుబతుకుల్లో ఆసుపత్రిలో వుంటే నువ్వు ఇంటిలో కూర్చుంటావా! నీకేమయినా మానవత్వముందా!" అని తెల్లబోయి చూస్తున్న టీచరుని, అదే స్థితిలో ఉన్న పల్లె ప్రజలనుండి ప్రక్కకులాగి అరగంట పాఠాలు చెప్పాడు. అన్నిటికి తలవూపి హాస్పిటల్ దిక్కుగా నడిచాడు ఆనాడు తను. ఒకసారి పేషంటువైపు చూడగానే ఆమె చావుకు దగ్గరల్లో వుందని అర్థమైంది. వెంటనే ప్రెసిడెంటు ఆజ్ఞ ప్రకారం ఆమె భర్తను తన విద్యార్థిని వెంటేసుకొని నాలుగు వీథుల కూడలిలో నిల్చున్నారు.

"సరే! డాక్టరమ్మ కివ్వాల్సిన నాలుగు రూపాయలు నీ చేతిలో లేవు. అలా అని నీ చేతుల్లో నీ భార్య ప్రాణం పోగొట్టకు! ఇట్లాటప్పుడు అడుక్కోటానికి సిగ్గుపడకూడదు. నలుగుర్ని నాలుగు డబ్బులడుగు."

వచ్చేపోయే జనాన్నంతా ప్రాధేయపడ్డాడు రంగడు.

"సామీ! నా భార్యకు కాన్పు కష్టమైపోనాది. డాక్టరమ్మ ముడుపు చెల్లించుకోందే ఆపరేషన్ చేయనంది. ఆపరేషన్ చేయకపోతే నా యింటిది బతకదయ్యా. రక్షించండి బాబయా!"

జాలిపడ్డ వారంతా తలా కొంత యిచ్చారు. వంటిమీద చొక్కాలేని రంగడి మాటలు కోటి విద్యలు కూటికొరకుగా తీసుకున్నవాళ్ళు అనుమానంగా తన వైపు చూశారు.

"నిజమే సార్, కాలం మరీ చెడిపోతోంది. ప్రాణాలు పోయాల్సిన డాక్టర్లే డబ్బుకొరకు ప్రాణాలు తీయడానికి సిద్ధపడుతున్నారు."

"వీడు నా స్టూడెంట్ సార్. వాడి గోడు వినలేక.... సహాయం చేయాలంటే బతకలేని బడిపంతులిని. నా సంగతి తెలుసుగా. అందుకే వాడికి సహాయంగా ఇక్కడ నిల్చున్నాను."

సహాయం చేసిన కొందరు ఆ సహాయం బూడిదలో పోసిన పన్నీరు కాకూడదనే ఉద్దేశంతో ఆసుపత్రికి బయలుదేరారు. లేడీ డాక్టరు దగ్గర డబ్బు సంగతి బయటపెట్టకుండానే మర్యాదగా అడిగారు.

"ఇంట్లో మంత్రసాని రెండు రోజులు హోరాహోరీ పోట్లాడి ఇక మామూలుగా కాన్పు కాదని మీ హాస్పిటల్‌కు పంపించింది. మీరు ఆపరేషన్ చేసేయండి డాక్టర్."

మామూలుగా కాన్పు కాలేదు కనుక ఆపరేషన్ చేసి బిడ్డను తియ్యాలనే విషయం మాత్రమే వాళ్ళకు తెలిసింది. గర్భసంచి పగిలిపోయి నాడి అందని స్థితిలో ఆపరేషన్ మొదలెడితే కత్తిరాల్చే మొదటి రక్తపు బొట్టుతో, ఆ పేషంటు పరలోకానికి సన్నాహ మౌతుందనే విషయం వారికి తెలియదు.

"ఇప్పుడామె పరిస్థితి బాగోలేదు. సెలైన్ పెట్టాము. పేషంటును ఆపరేషన్‌కు సిద్ధం చేస్తున్నాము. రక్తం కొరకు ప్రయత్నిస్తున్నాము. రక్తం సిద్ధం కాగానే ఆపరేషన్ మొదలెడతాను."

ఆమె చెప్పేది వాళ్ళు వినిపించుకోదల్చుకోలేదు. ఆమె చెప్పే ప్రతి మాట వెనుకా అర్థాలు, అరాలు తీశారు. డబ్బు చేతిలో పడిన మరుక్షణం ఆమె ఆపరేషన్ చేస్తుందని ఆ కామెర్ల మెదళ్ళకు అర్థమైపోయింది. ఆమెను వాళ్ళు గొడవ పెట్టదల్చుకోలేదు.

ఆ డబ్బు తొందరగా పారేసి ఆపరేషన్ చేయించి తల్లీ బిడ్డను రక్షించాలనేదే ఆశయం కూడా. కానీ, ఆ డాక్టరు దురదృష్టం ఆమె ఆ డబ్బును నిరాకరించే అవకాశం రాకముందే ఆ పేషంటు చనిపోయింది. ప్రజలు రెచ్చిపోయారు. కనీసపు మర్యాద నతిక్రమించి మాటల రాళ్ళను రువ్వారు. న్యూస్ పేపరు కెక్కించారు. కొందరు సోమరిపోతులు కథలల్లి పొద్దు పుచ్చుకొన్నారు. ప్రెసిడెంటుగారు మాత్రం ఆమె దగ్గర కొచ్చి "అయ్యో పాపం" అన్నారు. "నా సహాయం అడక్కపోయావా?" అన్నారు. "ప్రజలు మూర్ఖులు" అన్నారు. ఆ మూర్ఖ ప్రజలని పాలించే ప్రెసిడెంటుగార్ని అర్థం చేసుకున్న డాక్టరమ్మ 'లాంగ్ లీవ్' పెట్టి వెళ్ళిపోయింది.

* * * * *

"నన్ను పోనివ్వండి. ఒక్క చెంబు నీళ్ళడిగితే ఇవ్వరేం? మీరు మనుష్యులా! అయ్యో ఎవరది? నా కాళ్ళు నొక్కేస్తున్నారు బాబోయ్. చక్కపొది అంటిపెట్టుంది. ఒక్క బకెట్టు పట్టుకోనిండమ్మా. చంటోడికి కళ్ళలో పడుతోంది. కళ్ళు మూసుకో నాయనా! ఎవరది? నన్ను సూదులతో గుచ్చుతున్నారు. తల ఎండిపోతోంది. ఒక్కటే చెంబు, చెంబు, చెంబు...." లేబర్ రూమ్‌లోనుండి అరుపులు.... కోపం, విసుగు, ఏడుపు మిళితమైన జాగ్రదావస్థలోని అరుపులు.... మార్ఫియా మత్తును అధిగమించిన కేకలు. రక్త ప్రసారం సరిగా అందని మెదడు చేసే అస్తవ్యస్తపు ఆక్రందనలు.

"ఒరేయ్! ఎవర్రా మీరు? దయ్యాలా! గాడిద కొడుకులు నన్ను చంపేస్తున్నారు బాబోయ్! నా మొగుడేడీ! వాడే. వాడే నన్ను చంపే..." అందాల్సిన ఆహారం అందక, వివేకమూ సంస్కారమూ కోల్పోయిన నరాలు సలిపే ఆదిమ ప్రవృత్తి.

"ఉట్టిమీద ఊరగాయుంది. ఒక్క ముక్క పెట్టమ్మా తల్లి. అన్నం తిని నాలుగు రోజులయింది. నిన్ను కొట్టను గాని నాన్నకు తెలీకుండా ఒక్క ముక్క తెచ్చిపెట్టు బుజ్జమ్మా."

ఎక్కడో మూలదాగున్న మనసులోని కోరిక బలహీనమయిన నరాలద్వారా బయటకు పొంగిపోతోంది.

లేబర్ రూమ్ బయట బిక్కు బిక్కుమని నిలబడ్డ పదిహేనేళ్ళ బుజ్జమ్మ బావురుమంది.

భార్య అరుపులకూ, కూతురి రోదనకూ చైతన్యం తెచ్చుకున్న రామనాధం గబగబా డాక్టరుకేసి నడిచి, ఏదో అడగబోయి ఆగి, "ఒకసారి నన్ను చూడనిస్తారా?" అని బేలగా అడిగాడు.

మూర్తీభవించిన దైన్యరాశిలా వున్న రామనాధాన్ని క్షణంచూసి తలూపింది లలిత.

"వెళ్ళండి. చెప్పులు తీసేసి వెళ్ళి చూచిరండి."

"చంటోడు నిద్రపోతున్నాడు. వాడు లేచేసరికి పాలు కాగబెట్టాల నన్ను లేవనీండమ్మా. ఇప్పుడే వస్తాను. వదలమంటుంటే... ఓయమ్మో! నా కాలిమీద ఇనబ్బస్తా దొర్లించారు. అయ్యబాబోయ్! గుచ్చేస్తున్నారు" వెన్నుపూస చేస్తున్న ఆక్రందనలో మార్ఫియా మత్తులో సొమ్మసిల్లి పడిపోయింది. తలొంచుకొని నిస్పృహాయుడుగా బయటకు వచ్చేశాడు రామనాధం.

ఈమె యమయాతనలకు కారణమెవరు? ఊళ్ళోలేని డాక్టరమ్మా?... కాదు... తనే, తనే, తన మూర్ఖత్వమే.... ధనవంతుల బలానికి తలొగ్గి ప్రాణాలు పోసే డాక్టరమ్మ మీద అభాండాలు వేసి తరిమేసిన తన అకలే...

* * * * *

"వదిన ఎగ ఊపిరి పీలుస్తోంది. నాకు భయంగా వుందన్నా! ఇంకెక్కడయినా ప్రైవేటు ఆసుపత్రిలో చూపిద్దాం."

చెల్లెలిమాట రామనాధానికి అర్థం కాలేదు. వెర్రిచూపులు చూస్తున్న అన్నను వదిలేసి డాక్టరు లలిత దగ్గరకు వచ్చి ఇంచుమించు కాళ్ళు పట్టుకొని,

"మీకెంతయినా డబ్బిచ్చుకుంటాము. మీరు ప్రైవేటుగా చూడండి డాక్టరమ్మా" అంది. ప్రసన్నంగా వున్న డాక్టరు లలిత ముఖంలో బొమముడి పడింది. కళ్ళు ఎర్రపడ్డాయి. కోపంతో కాళ్ళు వెనక్కు లాక్కొని ఏదో అనపోయిన ఆమె వెంటనే సంబాళించుకుంటూ నిదానంగా అంది.

"మీరు మీ బాధలో, వ్యధలో, ఆతృతలో ఏదో పిచ్చిగా మాట్లాడుతున్నారు. ప్రాణాల్ని డబ్బుతో కొలవడానికి డాక్టర్లందరు అంత మానవత్వం లేని వాళ్ళు కాదు. మీరు ఏ కండిషన్‌లో అసలు పేషంటును తీసుకొచ్చారో మీకర్థమౌతోందా? మేము చేయగలిగిందంతా చేస్తాము. ఆ తరువాత మేము దేవుళ్ళము కాముగా!"

"ఇట్లాంటప్పుడు డబ్బును చూచుకుంటే ఎట్లా తల్లీ, తాకట్టు పెట్టయినా..."

ఆమె మాట పూర్తి కాకుండానే విసురుగా లేచింది డాక్టర్ లలిత.

"అసలు.... మీరు, మీరే డాక్టర్లను చెడిపేది.... వాళ్ళ కెదురుగా డబ్బు పెట్టి వాళ్ళను పతనంలోకి తోసేది... మీ డబ్బుతో డాక్టర్లను, ప్రాణాలను కొనగలమని అపోహ పడకండి. ముందు బైట కెళ్ళండి మీరు." చైతన్యం తెచ్చుకొన్న రామనాథం చెల్లెల్ని యివతలకు లాక్కొచ్చాడు.

"క్షమించండి. వాళ్ళకు తెలీదు."

"పర్వాలేదు. ఆమె బ్రతికితే మాకు కలిగే ఆనందం మీ కర్థం కాదు" కృతజ్ఞతగా చేతులు జోడించి, భార్య బెడ్ దగ్గరకొచ్చి ఆమె దగ్గరే కూర్చున్నాడు.

"అది వాళ్ళ దోషం కూడా కాదు లలితా. అలాంటి వాళ్ళు వుండబట్టే వాళ్ళు ఆ అపోహలో వున్నారు." ప్రక్క డాక్టరు మాటలు లీలగా వినిపిస్తున్నాయి రామనాథానికి.

"ఇలాంటి స్థితిలో వున్న పేషంట్సు దగ్గర కూడా ఆశించే డాక్టర్లు వుంటే వుండొచ్చు. నేనొప్పుకుంటాను. కనీ ఆ డబ్బు అందందే మృత్యు ముఖంలోకి అడుగెట్టబోతున్న ఇలాంటి రోగులకు సకాలంలో చేతిలో వున్న వైద్య సహాయం యివ్వనంత దానవత్వంలో వుంటారని నేననుకోను."

"ఆ విషయం వాళ్ళకెలా తెలుస్తుంది? వాళ్ళ ఆతృత వాళ్ళది! ఒకరోజు నా అనుభవం చెప్పితే నమ్మవు బహుశా! ఒకరోజు ఓ.పీ.లో ఒకతల్లి తన బిడ్డను నా ప్రక్కనున్న కుర్చీలో కూర్చోబెట్టి నా బల్లమీద పాతిక రూపాయలుంచి మీరు స్పెషల్‌గా చూడాలని ప్రాధేయపడింది. ఇలాంటివి అలవాటైన నేను "అలాగే చూస్తాను. ఇది ధర్మాసుపత్రి. నీ డబ్బు నీవు తీసికెళ్ళు." అని డబ్బు యిచ్చేశాను. అంతే లలితా! మరో నిముషం కూడా తన బిడ్డను, ఆమె రోగాన్ని నా ఆధీనంలో వుంచడానికి యిష్టపడలేదు ఆమె."

"నిజం సుగుణా... వీళ్ళు ఒక రకంగా మనల్ని ప్రలోభంలోకి నెడ్తున్నారని పిస్తుంది." డాక్టరు సుగుణ నవ్వేసి వూరుకుంది.

అంతా వింటున్న రామనాథం నిట్టూర్చాడు. రామనాథం భార్య మగతగా కళ్ళు మూసుకుంది. శ్వాసబరువుగా తీసుకొంటోంది. పడిపోయిన రక్తపోటు కాస్త పుంజుకున్నట్టుంది. మెదడుకు ఆహారం లభించింది. అరుపులు ఆపేసింది. రామనాథం భార్య మూసుకున్న కనురెప్పలకేసి చూస్తున్నాడు.

ఇరవై సంవత్సరాల తన భాగస్వామి, 'అవును' అనడమే కాని 'కాదనడం' తెలియని తన భార్య ఆనాడు తను చేసిన పనిని గర్హించింది. 'ఇది మనకు తగదు, ఆ డాక్టరమ్మ శాపం వూరకే పోదు' అని బ్రతిమలాడుకుంది. తను వినలేదు. కారణం తన పాపిష్టి కడుపులు. తనకు రాబోయే జీతం రాళ్ళమీదే కేవలం ఆధారపడ్డ ఆకలి తనని వివేక శూన్యుణ్ణి చేసింది.

'భగవంతుడు చాలా తెలివిగలవాడు. నా దోషానికి నా ప్రాణాన్ని కాక నా ప్రియమైన భార్య ప్రాణాన్ని కోరుకున్నాడు.'

'నిన్ను నేను హత్య చేస్తున్నాను శారదమ్మా.' అతని కళ్ళల్లో సన్నటి నీటిపొర.

సర్వశూన్యాన్ని ఆక్రమించిన ప్రాణ వాయువును అందుకోలేని దుర్బల ఊపిరి తిత్తులు పడే శ్రమ, ఆ మనిషిలో ప్రతి అణువు బ్రతుకు కొరకు చేసే పోరాటం, అతని కేదో బోధ పరిచినట్టయి, ఉలిక్కిపడి డాక్టరు దగ్గరకు పరుగెట్టాడు.

ఒక చేతికి మందు కలిపిన సెలైన్.... ఒక చేతికి రక్తం... చుక్కలుగా మారి అమె శరీరంలోకి ప్రవహిస్తూనే వున్నాయి. గొట్టాలద్వారా ప్రాణవాయువు అమె ఊపిరి తిత్తులలోకి సరఫరా చేయబడుతూనే వుంది. రక్తస్రావం ఆపే నిమిత్తం, రక్తపోటు పెంచే నిమిత్తం ఇంజక్షన్లు శరీరంలో రంధ్రం మీద రంధ్రం ఏర్పరుస్తూనే వున్నాయి. కానీ విపరీతమైన రక్తస్రావం వలన చైతన్యాన్ని కోల్పోయిన అవసరావయవాలు తిరిగి కోల్కోలేదు. శ్వాస తీసుకోడానికి యాతన పడుతోన్న ఊపిరితిత్తులు శాశ్వత విశ్రాంతి తీసుకున్నాయి.

"సారీ! అమె చనిపోయారు." రామనాథం ఉలిక్కిపడలేదు. బాధపడలేదు. కేవలం పశ్చాత్తాపపడ్డాడు. లేడ డాక్టరు దయగా చూచింది.

"ఒక డాక్టరు మీ వూరిలో వుండుంటే, అమె బ్రతికుండేది. ప్రభుత్వానికి అప్లికేషన్ పెట్టుకోండి."

అచేతనంగా నిల్చున్న టీచర్ విరక్తిగా నవ్వాడు.

"లేదు డాక్టర్! మా వూరు డాక్టర్లను తరిమికొడుతుంది. అధికారం దుర్వినియోగం అవుతున్నంత కాలం, పదవులు వ్యక్తి స్వార్థం కొరకు మాత్రమే అయినంత కాలం మా దౌర్భాగ్యం ఇలా సాగిపోవల్సిందే, మా బ్రతుకులిలా తెల్లవారాల్సిందే. మా మూర్ఖత్వానికి, అమాయకత్వానికి జరిగిన శాస్తి ఇది డాక్టర్.... మా పల్లెలకిది శాపం." అని చెప్పాలనుకున్న రామనాథం నోరు మూగవోయింది. అతని కళ్ళు ఎండిపోయాయి. చేతులు మటుకు కృతజ్ఞతా సూచకంగా అసంకల్పితంగా ముకిళించబడ్డాయి.

దయగా చూస్తున్న డాక్టరు దగ్గర శెలవు తీసుకొని తనతో ఇరవై సంవత్సరాలు కష్టసుఖాలు పంచుకున్న ధర్మపత్ని మృత్యుదేహాన్ని తీసుకుని తిరుగు ముఖం పట్టిన రామనాథాన్ని వూరడించడానికి, ఆ వూరి ప్రెసిడెంటు ఎదురు రాలేదు. నిన్న రాని కూతురికి యీ రోజు స్వాగతం చెప్పటానికి ఆయన స్టేషన్‌లో వున్నాడు.